# వైనతేయులు

ఇద్దరు కూర్చున్నారు. ఒకడు కథ చెపుతున్నాడు. రెండోవాడు వింటున్నట్టు నటిస్తున్నా వినలేదు. ఏవిటో ఆలోచిస్తున్నాడు. కథ చెపుతున్నవాడు చెపుతూనే వున్నాడు. పాత్రలు, పట్టణాలు, సంఘటనలూ దొర్లిపోతూనే ఉన్నాయి నిఘంటువులో కనబడని మాటలూ, నిఘంటువులో లేనిమాటలూ తెగవాడేస్తున్నాడు. రెండోవాడు వింటున్నాడనే ఇవన్నీ వాగీలేదు, వాడువింటున్నా వినకపోయినా ఇదంతా పేలవలసిందే.

ఇద్దరు కూర్చున్నారు. ఒకడు ఆలోచిస్తున్నాడు. రెండోవాడు ప్రక్కన కూర్చున్నట్టు నటిస్తున్నా కూర్చోలేదు. ఏమిటో ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తున్నవాడు ఆలోచిస్తూనే ఉన్నాడు. పాత్రలు పట్టణాలు, సంఘటనలూ దొర్లిపోతూనే ఉన్నాయి. జీవితంలో కనబడని విషయాలూ. జీవితంలో లేనివిషయాలూ చెడుకల గంటున్నాడు. రెండోవాడి కివి తెలియకుండా ఉండాలని ఆలోచిస్తున్నవాడి ఆశ.

ఇద్దరూ కూర్చున్నారు. ఇద్దరూ సిగరెట్లు కాలుస్తున్నారు. ఇద్దరూ బంగాళాదుంపలచిప్సు నంచుకొంటూనే ఉన్నారు. ఇద్దరూ బరువుగా మూసుకుపోతున్న కళ్ళని తెర చిందికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇద్దరూ కూర్చున్న గుడ్డి వెలుగులోంచి ఈదుకుంటూ నిశ్చలమైన చీకటిలోకి చేరు

కొందికే ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇద్దరూ తిమ్మిరెక్కు-
తున్న ఒళ్ళు ఇంకా తిమ్మిరెక్కాలని ఆశపడుతూనేఉన్నారు.

ప్రక్కన వాగుతున్న రేడియో వాళ్ళిద్దరికోసమే వాగుతున్నాది. మీద తిరుగుతున్న పంకా వాళ్ళిద్దరికోసమే తిరుగుతున్నాది. వెలుగుతున్న బత్తీలు వీళ్ళిద్దరికోసమే వెలుగుతున్నాయి. గాని ఆనాలుగు గోడల అవతలఉన్న ప్రపంచంలోని రాపిడి, తొక్కిడి, రాకపోకలు, ప్రకటనలు, అమ్మకాలు, జేబు దొంగతనాలు, దయా ధర్మాలూ వీళ్ళిద్దరికోసం జరగడంలేదు.

కథ చెపుతున్న వీడిమాటలు మచ్చుకి ఇక్కడ కొన్ని రాస్తే కోం పడతారు. ఆలోచిస్తున్నవాడి ఊహలు ఉదహరిస్తే గవర్నమెంటువాళ్ళు కేసుపెడతారు. అయినా ఇద్దరూ వాళ్ళు చేస్తున్న క్రియల్ని చేస్తూనే ఉన్నారు. ఒకడు పేలుతూ ఉన్నాడు; ఒకడు కునుకుతూ ఉన్నాడు.

మాట్లాడుతున్నవాడి మాటలని తెలుగులోకి తర్జుమా చేసిందికి ప్రయత్నిద్దాం. 'ఉత్తుత్తికయ, ఉత్తరేణీకాయ, దావిమ్మాకాయ దబబకాయ రాత్రేమయిం దనుకొన్నావు. భూవికేకేసింది సీశా అమ్మవారు దిగబడిపోయారు. ఏరాడ కొండమీద ఎండదిగింది. కొవ్వనే కథుందే అలాగే. చూడూ వింటున్నావా? సీతల్లికడుపు బంగారంగానూ, ఇలారా ఇంకొకటే.'

పై మాటలలోంచి మన కిందగలిగిం దేమీలేదు. అయినా వాడు అంటున్న మాటల కిదే నమ్మకమైన తెనిగింపు. ఉచ్చారణదోషాలని మనం పాటించకుండావుంటే వాడు అంటున్న మాటలకి డిక్షనరీలు మిషనరీలు ఇదే అర్థం చెప్తారు.

ఆలోచిస్తున్నవాడు ఏవని ఆలోచిస్తున్నాడో కూడా వెతుకుపట్టిచూ స్తే ఎందుకేనా మంచిది. మధ్యనుంచితీద్దాం ఒక పీలికని. 'ఆవిడప్పుడువచ్చి పాలసీసా అందించింది. నేను జున్నుగాని తిన్నంటాను. దుకుడుతనంతో చూస్తుంది. చూడక తప్పుతుందా. పాలసీసాని విరక్కొట్టేస్తాను. వీడొస్తాడు. వచ్చి ఆవిణ్ణి బాదేస్తాడు. నేను చూస్తూ ఊరుకోలేక కలియపడతాను. వాడి తడాఖా-బాబో'

పై కడిలోంచి మనం గ్రహించేది ఏదీలేదు. అయినా వాడు తలచుకుంటున్నది ఇదేఅని విశ్వసనీయంగా నేను చెప్పగలను. ఇతగాడి చరిత్ర తెలిసిన మనశాస్త్రవేత్తలు దీనికి అర్థం ఉందని చెప్పారు.

మాట్లాడుతున్నవాడు 'ఇంకొకటి' అన్నప్పుడు ఆలోచిస్తున్నవాడు తేరుకొని, 'ఇంకొకటేమిటి—ఇంకొకటెన్నర' అన్నాడు. పేలుతున్నవాడు 'ఛీఛీ పరువుతక్కువ అరలు మన దేశంలో వాడం. అయితే అయినవాడిపెళ్ళి! పూరా—రెండు రెండు ఒకట్లు' అన్నాడు. కలలుకంటున్నవాడు 'ఊఁ రెండు రెండు పెద్దవి సుమా మర్చిపోగలవు' అని హెచ్చరించేడు.

ఎవడితల్లి కడుపు బంగారంకాబోతున్నాదో వాడు-మూడోవాడు నవ్వేన్నాడు. ఈ మూడోవాడికథే మనం అసలు చెప్పాలోవలసింది. అయినా వాడు ఉండీ లేనట్లే, లేనట్టున్నా ఉన్నట్లే ఉంటూఉంటాడు. ఈనవ్వినవాడు కొల తల్లప్రకారం నవ్వుని దిమ్మరించేడు. నవ్వుకితోడు నవ్వుకి నాలుగింతల కుషీ బరాయించేడు.

ఇద్దరూ నవ్వుని సేవించి మళ్లా దీక్షలో పడ్డారు. ఈసారి ముందు ఆలోచిస్తున్నవాడు వాగడం ప్రారంభించేడు. ముందుకథ చెప్తున్నవాడు మూగినోము పట్టేడు. ఇద్దరూ ఈసారి బహుజాగ్రత్తతో కూర్చుందికి తంటాలు పడుతున్నారు. ఒకడు గాల్లోచెయ్యి కదిపి అందకుండా ఉందన్నాడు. మూడోవాడు ఏమిటన్నాడు. అందకుండా ఉందన్న వాడు స్వరాజ్యం అన్నాడు. మూడోవాడు ఫకాలుమని వెక్కిరించాడు.

మూగినోము పట్టినవాడు తేన్చి 'బ్ర-బ్ర-బ్ర-డార్-మరి-మరి- మరింతా' అని ప్రశ్నతోక జాడించేడు. కొత్తవాగుడుగాడు ముక్కి 'పిగ రెక్లేపీ' అన్నాడు. 'వర్జినియా? ఫరవాలేదు, మనకంతా ఒకటే' అన్నాడు. మూడోవాడు లాభంలేదన్నాడు. వాచీ పదిగంటలుకొట్టి లాభంలేక పోడాన్ని ద్వితీయపర్చింది.

మూడోవాడు ఇద్దర్నీ చెరోరెక్కా పట్టుకొని గుమ్మందాకా తీసుకొచ్చేడు. ఇద్దరూ దయ్యాలంటే మనం నమ్మేస్తాం. ఏవంటే వాళ్ళ కాళ్ళు భూమిని అంటకుండా ఉన్నాయి.

ఇద్దరూ గాలిని ఊతతీసుకొని నిల్చున్నట్టు ఊడిపోతున్నారు మనోలోకం పొరలు వాళ్ళతలనుంచి కాళ్ళదాకా కప్పబడినట్టు మసక కమ్ముకొని ఉంది.

వాళ్ళిద్దరూ ఇంతకుముందు కూర్చొనిఉన్న నాల్గు గోడల అవతల ప్రపంచంలోని రాపిడి, తొక్కిడీ రాకపోకలు ప్రకటనలూ, అమ్మకాలూ జేబుదొంగతనాలు, దయా ధర్మాలూ దీపాలు ఒక్కసారి వాళ్ళిద్దర్నీ పరకాయించి వాటి వాటి రొటీషనులో పడ్డాయి. ఇద్దరూ ద్వారాన్ని చీల్చుకొని లోకంలో అప్పుడే పడుతున్నట్టుంది.

మూడోవాడు ఇద్దరి జేబుల్నీ సవరించి వదిలేడన్న విషయం మనకి జ్ఞాపకం ఉండవలసినది కాదు. ఇద్దరు రిక్షా వాళ్ళు గుమ్మందగ్గరకి వచ్చి నించున్నారు. మూడోవాడు వాళ్ళిద్దర్నీ అప్పచెప్పి లోపలకి మాయమైపోయేడు.

రిక్షావాళ్ళు ఎక్కడకని అడక్కుండా ఇద్దర్నీ రిక్షాలో కూలదోసి లాక్కొని పోయారు. వాళ్ళకి తెలుసు. ఇక్కడికొచ్చే ఇద్దరూ ఎక్కడికి మూడొంతులు వెళ్ళేదీ. వెలుతురులో చక్రాలు దొర్లి పోతున్నాయి. రిక్షాలు చకచకా పరిగెడుతున్నాయి.